క్లుప్తంగా

23న కేటీఆర్ పర్యటన

● నేడు ముఖ్యకార్యకర్తల సమావేశం

శాయంపేట : రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 23న భూపాలపల్లి జిల్లా పర్యటనకు రానున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటీఆర్ రాక సందర్భంగా మండల కేంద్రం లోని రైతు వేదికలో నేడు (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్ పర్సన్ జ్యోతి హాజరౌతారని వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భగవద్గీత పఠనంతో మోక్షం

శాయంపేట : భగవద్గీత పఠనంతో మానవులకు మోక్షం లభిస్తుందని హిందూ జ్ఞానవేదిక తెలంగాణ ప్రాంత కమిటీ సభ్యుడు రవీందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆ వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ హిందూ జ్ఞాన ధర్మ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శుక్రవారం నుంచి సోమవారం వరకు మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథముల ప్రచారం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత కమిటీ సభ్యులు ఓంప్రకాశ్, రవీందర్‌రెడ్డి, దేవేంద్ర, రాధిక, పంచాక్షరి, సుధాకర్, ఉపేందర్, సాయిరాజ్, గోపి, సతీష్‌చారి, రమేష్, శంకర్, నరేష్, ప్రసాద్, శ్రీనాథ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లతో ఆర్థికాభివృద్ధి

దామెర : దళితబంధు యూనిట్లను లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని దళితబంధు యూనిట్లను సోమవారం ఆయన సందర్శించి తనిఖీ చేశారు. యూనిట్ల నిర్వహణపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. లబ్ధిదారులు దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన లాభాలు సాధించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. దళితబంధు యూనిట్లను వినియోగించుకుని పేదలు ఆర్థికంగా బలపడాలని కోరారు. ఆ దిశగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు.

'108' లేక ఇబ్బందులు

శాయంపేట : మండలానికి 108 అంబులెన్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మగ్గం సుమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజల సౌకర్యార్థం అంబులెన్స్ కేటాయించాలని కోరుతూ గతంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రం జ్యోతిలకు పలుమార్లు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. మండలంలో ప్రమాదాలు చోటు చేసుకుంటే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలంటే 108 అంబులెన్స్ లేకపోవడంతో బాధితులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఇతర మండలాల నుంచి 108 అంబులెన్స్ వచ్చే సరికి క్షతగాత్రులు చికిత్సలో జాప్యం చోటు చేసుకుని ప్రాణం కోల్పోయే అవకాశం ఉందని వివరించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ చొరవ తీసుకుని మండలానికి 108 కేటాయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్కతుర్తి : మండల కేంద్ర శివారులోని హన్మకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని తిమ్మారావుపేటకు చెందిన ఫాదర్ చిన్నయ్య మండలంలోని శాంతినగర్ నుంచి ద్విచక్ర వాహనంపై కాజీపేటకు వెళ్తుండగా ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చిన్నయ్య స్వల్ప గాయాల పాలయ్యాడు. అతడ్ని స్థానికులు చికిత్స కోసం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

జనార్దన్‌కు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన జూనియర్ కళాశాల గెజిటెడ్ లైబ్రేరియన్, సామాజిక కవి కందగట్ల జనార్దన్ కళారంగంలో చేస్తున్న సేవలకు గాను ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల నుంచి 70 మందిని ఎంపిక చేయగా వారిలో జనార్దన్ ఎంపికయ్యారు. ప్రముఖ సినీ హీరో రాజ్‌కాంత్, విశిష్ట అతిథులు డాక్టర్ అనిత మోహన్‌దాస్, మంజుల గౌర్, డాక్టర్ హన్మంతరావు, ట్రస్ట్ చైర్మన్ మానుమాన్ల నాగరాజు, సభాధ్యక్షులు టీవీ.అశోక్‌కుమార్, దాసి శివదేవ్, ప్రముఖ గాయకులు ప్రణయ్ కుమార్, శేష భారతి, డాక్టర్ పగిడిపాటి రాజు, ట్రస్టు సభ్యులు జనార్దన్‌ను శాలువాతో సత్కరించి షీల్డ్ తోపాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. జనార్దన్‌ను పలువురు అభినందించారు.

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు

ఐనవోలు : మండలంలోని ఐనవోలు శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం ఒగ్గు పూజారుల ప్రాతఃకాల మేల్కొలుపుతో పూజలు ప్రారంభం కాగా అర్చకులు శైవాగమ పద్ధతిలో నిత్య పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ మాడ వీధుల్లో స్వామి అమ్మవార్లు పర్వత వాహనసేవపై ఊరేగారు. ఆలయంలో గవ్యాంత పూజలు, రుద్రహోమం, చండిహోమం, మృగయాత్ర, నిత్య ఉపాసన, బలిహరణ పూర్ణాహుతి విశేషంగా జరిపించారు. అనంతరం చూర్ణోత్సవం, వసంతోత్సవం, త్రిశూల స్నానం, అవబృధు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో సకల దేవతలను ఆహ్వానిస్తు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించగా ఉత్సవాల ముగింపునకు చిహ్నంగా పరివార దేవతలందరికి ఉద్వాసన పలికి వేదమంత్రాల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు అర్చకులు ప్రకటించారు. రాత్రి ఒగ్గు పూజారులు పవళింపు సేవ చేయగా పుష్పోత్సవం, ఏకాంత సేవలు అర్చకులు జరిపించడంతో కార్యక్రమాలు ముగిశాయి. ఊటూరి అభిలాష శర్మ బృందం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండిట్ గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ శర్మ, భాను ప్రసాద్ శర్మ, నరేశ్ శర్మ, మధు శర్మ తదితరులు పాల్గొన్నారు.



పర్వతవాహన సేవలో రవీందర్‌రావు, తదితరులు



గర్భాలయంలో శ్రీమల్లికార్జునస్వామి, గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ అమ్మవార్లు

ఒర్రెలో పడి 50 గొర్రెలు మృతి

● పెంపకందారులకు రూ.3 లక్షలు నష్టం

శాయంపేట : మేత కోసం వెళ్లిన సుమారు 50 గొర్రెలు ఒర్రెలో ఒకదానిపై మరొకటి జారిపడి మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని గోవిందాపూర్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. గొర్ల కాపరుల కథనం ప్రకారం ... పరకాల మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కిష్టబోయిన ఐల్లయ్య, ఓదెల ఓదేలు, మొర్రి సుధాకర్‌లకు చెందిన సుమారు 200 గొర్రెలను మండలంలోని గోవిందాపూర్ శివారులోని పత్తి చేనులో మేపడానికి తీసుకెళ్లారు. రోడ్డు పక్కనే ఉన్న ఒర్రెను గమనించకుండా గొర్రెల మందను తోలడంతో అవి ప్రమాదవశాత్తు ఒకదానిపై మరొకటి పడి సుమారు 50 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. ఈ విషయాన్ని కాపర్లు యాజమానులకు తెలియజేయడంతో వారు వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. కిష్టబోయిన ఐల్లయ్యకు చెందిన 20 గొర్రెలు, ఓదెల ఓదేలుకు చెందిన 15 గొర్రెలు, మొర్రి సుధాకర్‌కు చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత గొర్రెల యజమానులు వాపోయారు. తమకు రూ.3 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్టు బాధితులు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని గొర్రెల యాజమానులు కోరుతున్నారు.



మృతి చెందిన గొర్రెలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పరామర్శ



ఎల్కతుర్తి : పరామర్శిస్తున్న బండి సంజయ్



శాయంపేట : పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

ఎల్కతుర్తి : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గాజుల ఐలయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వరప్రసాద్ కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జిల్లా నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, జన్నారపు సురేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు జనగాని కిష్టయ్య, పెరుకు మధుకర్, కంచర్ల శంకరయ్య, ఎర్రగొల్ల శ్రీనివాస్, చిదురాల వెంకటేష్, ఎర్రగొల్ల రాజు, భగవాన్‌గౌడ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భూక్య శ్రీను పెద్దనాన్న ఇందుర్తి కనకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి పరామర్శించారు. తొలుత కనకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ పోతు సుమలత రమణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, నాయకులు కోసరి రాజు, పెద్దిరెడ్డి వేణు, సురేంద్రచారి, పంగ ఇంద్రయ్య, రాజు, కొమురయ్య పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణతోనే స్వచ్ఛగ్రామాలు

అత్మకూరు : వ్యర్థాల నిర్వహణ పక్కాగా జరిగితేనే పల్లెలు స్వచ్ఛగ్రామాలు తయారౌతాయని ఎంపీపీ సుమలత తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మకూరు, దామెర మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఓ అధ్యక్షులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్వచ్ఛభారత్ రెండో దశ లక్ష్యాల సాధనపై మూడ్రోజులపాటు తలపెట్టిన శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుమలత హాజరై మాట్లాడారు. పల్లెల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని చెప్పారు. దోమల నిర్వహణ కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాలు శుభ్రంగా ఉండేలా ప్రజలకు అధికారులు సహకరించాలన్నారు. శిక్షకుడు, ఏపీఓ కుమారస్వామి మాట్లాడుతూ రాబోయే తరాలు గాలి కూడా కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగితేనే సహజ వనరులను భావితరాలకు అందించగలమని చెప్పారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ రహిత జీవనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాలను సాధించేందుకు గ్రామాల్లోని అన్ని శాఖల ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎల్‌పీఓ రవికుమార్, ఎంపీఓ సి.చేతన్ రెడ్డి, శిక్షకులు సిహెచ్.శ్రీనివాస్, స్వచ్ఛభారత్ మిషన్ ఉద్యోగులు ప్రవీణ్, సంపత్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఏపీఓ కుమారస్వామి

శివరాత్రికి పోటెత్తిన భక్తులు

● శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు

పరకాల : మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం, జాగరణ, మహారుద్ర యాగ మహోత్సవాలకు భక్తులు పోటెత్తినట్టు స్థానిక శ్రీకుంకుమేశ్వరాలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 20 వేల మంది భక్తులు హాజరౌతారని తాము అంచనా వేయగా అందుకు భిన్నంగా సుమారు 50 వేల మంది ఒక్కరోజున ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించారంటూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలతోపాటు పోలీసులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో మోసపూరిత పాలన

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

నడికూడ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఓవైపు అభివృద్ధి చేస్తున్నామని చెబుతూనే మరోవైపు మోసపూరిత పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కంఠాత్మకూర్, రామకృష్ణాపూర్ గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు ప్రేమేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ యథేచ్ఛగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ రైతుల పక్షాన పోరాడుతుందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా పార్టీ బలోపేతానికి బాటలు వేసి రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలిచేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

పట్టాలివ్వకుంటే ఆందోళనలు తప్పవు

● సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్

భీమదేవరపల్లి : పేదలు ఆక్రమించుకున్న స్థలాలకు సంబంధించి పట్టాలివ్వకపోతే ఆందోళనలు తప్పవని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 120లో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 600 మంది పేదలు గుడిసెలు వేసుకుని మూడు నెలలుగా నివాసం ఉంటున్నా ప్రభుత్వం ఇప్పటికీ పట్టాలివ్వలేదని మండిపడ్డారు. పేదలు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇళ్ల నిర్మాణాల కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ శ్రేణులు పేదలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాల నిర్మాణ దిశగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలందరికీ జీఓ నంబర్ 58 ప్రకారం పట్టాలివ్వాలని, పక్కా ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి, నాయకులు తిరుపతి, ఆదరి రమేష్, బాలరాజు, దిలీప్, కృష్ణ, స్వరూప, స్వప్న, మమత, పద్మ పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే 'కంటి వెలుగు' లక్ష్యం

● సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు

ఎల్కతుర్తి : అంధత్వ నిర్మూలన కోసమే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు తెలిపారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే ఆశయంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కంటి సమస్యలున్న ప్రతిఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించగా 51 మందికి కళ్లద్దాలు అందించినట్టు వైద్యులు, సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, డాక్టర్ సబిత, కంటివెలుగు కంట్రోలర్ డాక్టర్ చొక్కయ్య, ఎంపీడీఓ తూర్పాటి సునీత, వైద్యాధికారి హిక్తేదార్ హైమ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ జునేది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న రామారావు

వర్గీకరణకు రేపటి నుంచి పాదయాత్ర

భీమదేవరపల్లి : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22 నుంచి పాదయాత్ర చేపడతామని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) జిల్లా ఇన్‌చార్జి మంద రాజు తెలిపారు. మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాట్ల వెంకటస్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ముఖ్యనాయకుల సమావేశానికి రాజు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీతో తాడోపేడో తేల్చుకునేందుకు మాదిగ, మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మరో భారీ పోరాటం తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను ధినేష్, రేణుకుంట్ల భిక్షపతి, జిల్లా కన్వీనర్, కోకన్వీనర్‌లు గద్దల సుకుమార్, గంగారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద రాజు

బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శిగా నియమించినట్లు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు విస్తరించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో తనను మండల కార్యదర్శిగా నియమించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు.



బీఎస్పీ మండల అధ్యక్షుడిగా చిరంజీవి

భీమదేవరపల్లి : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల శాఖ అధ్యక్షుడిగా ముత్తారం గ్రామానికి చెందిన తాడూరి చిరంజీవిని నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, ఇన్‌చార్జి ఎనగందుల శంకర్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి పవన్, ప్రధాన కార్యదర్శిగా గడిపె భిక్షపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బుసుమల్ల రాజు, బీవీఎఫ్ మండల కన్వీనర్‌గా పులి సరేష్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ప్రెస్‌క్లబ్‌లో నాయకులు గజ్జెల సురేష్, అండె సాల్మన్ సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నడిగోట నరేష్, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు పులి నీరజ, వి.నాగరాజు పాల్గొన్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

పార్టీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సమస్యలను పొందుపరుస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి పాదయాత్ర సోమవారం సాయంత్రం వరంగల్ ప్రెస్‌క్లబ్ ముందు నుంచి వెళ్తుండగా గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ కోరిక మేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లోకి రేవంత్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం, రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో వరంగల్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఇప్పటికీ వాటిని వారికి అప్పగించిన దాఖలాలు లేవని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి ప్రజలను జాగృతం చేసిన జర్నలిస్టులకు.. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం అండగా నిలబడలేదని తప్పుపట్టారు. రేవంత్‌రెడ్డి వెంట ములుగు ఎమ్మెల్యే సీతక్క, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్, పార్టీ సీనియర్ నేత మల్లు రవి, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

వరంగల్: అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులందరు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని ఇంటర్నేషనల్ 2వ వైస్ ప్రెసిడెంట్ బాల గంగాధర్ శాస్త్రి సూచించారు. వరంగల్ డిస్ట్రిక్ట్ (192), హనుమకొండ డిస్ట్రిక్ట్ (254) సంయుక్తంగా కాశిబుగ్గ తిలక్‌రోడ్డులోని కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో 8వ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పేదలకు దుస్తులు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రక్త శిబిరాలు, అవయవ, నేత్ర దానాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం వరంగల్ డిస్ట్రిక్ట్ 192 గవర్నర్‌గా అలయ్ చంద్రపలక శామ్యూల్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లుగా చిప్ప వెంకటేశ్వర్లు, పెండెం మానస, హనుమకొండ డిస్ట్రిక్ట్ 254కు గవర్నర్‌గా అలయ్ భూపతి శంకర్, వైస్ స్టిక్ట్ గవర్నర్లుగా బండ సాయిరెడ్డి, సుంకిశాల సంతోష్‌రావు, గుజ్జారి శ్రీధర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అలయ్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లింగమూర్తి, మండల రవీందర్, బొజ్జ మధుసూదన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు సూచించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ సహకారంతో హసన్‌పర్తి జిల్లా పరిషత్ పదవ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సర్కార్ పాఠశాలల్లో త్వరలోనే డిజిటల్ విద్యావిధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ అధ్యక్షుడు చిదురాల కరంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుమార్, పద్మ, వాసవి క్లబ్ రీజియల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, జోన్ కోఆర్డినేటర్ శంకర్, క్లబ్ కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి పురవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ విధానాన్ని రద్దుచేయాలి

కాజీపేట రూరల్: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ సూచించారు. మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ అధ్యక్షుడు పాక వేదప్రకాష్ ఆధ్వర్యంలో కాజీపేట డీజిల్‌షెడ్ ఎదుట సోమవారం కార్మికుల గేట్‌మీటింగ్, సంతకాలు సేకరించి రాష్ట్రపతికి టెలిగ్రామ్ చేశారు. జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం కార్మికుల హక్కులు, డిమాండ్లను నెరవేర్చి, కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు భిక్షపతి, జాని మియా, మహేందర్, యాదగిరి, రమేష్, రాజేశ్వర్‌రావు, శంకర్, ప్రదీప్, రవికిరణ్, శివప్రసాద్, నరేష్, దినేష్, కృష్ణ, దేవేందర్, భీష్మదేవ్, చేరాలు, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

పేద వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ వివేకానందకాలనీకి చెందిన పేద దంత వైద్య విద్యార్థిని గోవిందుల పూజితకు వరంగల్ తూర్పు బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేసి, వైద్యవిద్య పూర్తయ్యే వరకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కాగా, పూజిత తండ్రి భిక్షపతి సైకిల్‌పై తిరుగుతూ బెడ్ షీట్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి ఉమాదేవి కిరాణ షాపులో గుమస్తాగా పని చేస్తోంది. దాతలు స్పందించి చేయూతనందించాలని పూజిత తల్లిదండ్రులు కోరుతున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుతారి గోపి, అపురూప రజనీష్ నేత, ఆడెపు వెంకట్, చింతం రాజు ఉన్నారు.



సాయం అందజేస్తున్న వెంకటరమణ